సాక్షి పల్నాడు
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



కనులపండువగా తిరునాళ్ల

దాచేపల్లి: నడికుడిలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు.



అయ్యప్పస్వామికి అభిషేకాలు

నగరం: స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానం లోని అయ్యప్పకు బుధవారం పంచామృతాలతో అభిషేకాలను కనులపండువగా జరిపించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి బుధవారం లక్ష్మీప్రసాదు, పద్మప్రియ దంపతులు రూ. 3,01,116లు విరాళం అందించారు.

న్యూస్‌రీల్

నేడు కేతవరంలో ప్రతిష్టా మహోత్సవం



బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కేతవరంలో కొండపై వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహుని ఆలయంలో గురువారం ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నట్లు మండల దేవదాయ శాఖ ఈఓ అవుదూరి వెంకటేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొండ దిగువన గల స్వామివారి ఆలయం వద్ద జీవ ధ్వజస్తంభం, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉదయం 9 గంటలకు జరగనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

అభాగ్య శిశువుల కోసం ఊయల



నరసరావుపేట: అభాగ్యులైన శిశువులను అక్కున చేర్చుకునేందుకు బుధవారం జిల్లా శిశు సంక్షేమం, సాధికారిత అధికారి ఆధ్వర్యంలో పెద్దచెరువులోని శిశుగృహంలో క్రైడిల్ బేబీ రెడెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా అభాగ్యులైన శిశువులను చెత్తకుప్పలు, కాలువల్లో వేయకుండా బతకనిచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఊయలలో వేయాలని పీడీ ఉమాదేవి కోరారు. సూపరింటెండెంట్ లోకనాథం, నోడల్ అధికారి అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లఫారాలను పరిశీలించిన అధికారులు



వినుకొండ: మండలంలోని వెంకుపాలెం, కోటప్పనగర్, ఈపూరు మండలంలోని చిట్టాపురం, శ్రీనగర్ గ్రామాల్లోని బ్రాయిలర్ కోళ్ల ఫారాలను జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కె.కాంతారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రాయిలర్, లేయర్ కోళ్ల ఫారంలోని కోళ్లు ఆరోగ్యంగానే ఉన్నట్లు నిర్ధారించారు. పౌల్ట్రీ ఫారం రైతులు కాళంగి శ్రీనివాసరావు, దావులూరి రంగారావులను ఫారంలో తీసుకుంటున్న బయో సెక్యూరిటీ పద్ధతులను గురించి అడిగి తెలుసుకున్నారు. బర్డ్ ఫ్లూ కలకలం నేపథ్యంలో ఫారంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలిపారు. అదేవిధంగా బ్రాయిలర్ కోళ్లకు మేత పద్ధతిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. వినుకొండ సహాయ సంచాలకులు డాక్టర్ బి.సరోజాదేవి, ఈపూరు సహాయ సంచాలకులు డాక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి కొండ్రముట్ల పశు వైద్య అధికారి డాక్టర్ వి.గోపాల్ నాయక్, పశుసంవర్ధక సిబ్బంది నాగరాజు, శివశంకర్, శిరిష తదితరులు పాల్గొన్నారు.

'98' డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

మంగళగిరి టౌన్: 1998 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని ఓబీసీ జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి ఐబీఎన్ భవన్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1998 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థులందరికీ వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా ఉద్యోగం రాని వారికి వయోపరిమితి నెలల వ్యవధి మాత్రమే ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. డీఎస్సీ రిమైనింగ్ కాండిడేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అవుతున్నా ఇంతవరకు డీఎస్సీపై ఎటువంటి స్పందన లేదని, పలుమార్లు విజ్ఞాపనలు సమర్పించామని పేర్కొన్నారు. 8 జిల్లాల్లో దాదాపు 1500 మంది అభ్యర్థులు ఉన్నారని, 600 శాంక్షన్ పోస్టులు మిగిలి ఉన్నాయని మానవతా దృక్పథంతో మరో 900 పోస్టులు కలిపి తక్షణం ఎస్జీటీలుగా అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రెస్‌క్లబ్ నుంచి మంగళగిరి అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. 98 డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ భయం.. అప్రమత్తం



నరసరావుపేట బాలయ్య నగర్‌లో బాలిక ఆరాధ్య గృహం



ఇంటి సమీపంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరం

రాష్ట్రంలో మొదటి బర్డ్‌ఫ్లూ మరణం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సంభవించడం స్థానికంగా కలకలం రేపుతోంది. పట్టణానికి చెందిన రెండేళ్ల చిన్నారి ఆరాధ్య గత నెల 15వ తేదీన బర్డ్‌ఫ్లూతో మృతి చెందినట్లుగా ఎయిమ్స్ వైద్యులు మంగళవారం నిర్ధారించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన వైద్యాధికారులు బాలిక కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారికి రక్తపరీక్షలు చేశారు. బాలిక ఇంటివద్ద బాలయ్యనగర్‌లో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

– నరసరావుపేట

నేటి నుంచి 'పది' మూల్యాంకనం


విధుల్లో 1089 మంది సిబ్బంది



కేబీఆర్ కళాశాల

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 3వతేదీ నుంచి ప్రారంభం కానుంది. పట్టణంలోని కేబీఆర్ కళాశాలలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పల్నాడు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉండేలా కేబీఆర్‌ను అధికారులు ఎంపిక చేశారు. ఈనెల 3 నుంచి 9వతేదీ వరకు ఏడు రోజుల పాటు కొనసాగనున్న కేంద్రంలో దాదాపు 1.75 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకు గాను 121 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 726 మంది ఎగ్జామినర్లు, 242 మంది స్పెషల్ అసిస్టెంట్లు విధుల్లో పాల్గొంటున్నారు. క్యాంప్ ఆఫీసర్‌గా డీఈఓ, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లుగా డిప్యూటీ డీఈఓలు వ్యవహరించనున్నారు. ఎగ్జామినర్లు ప్రతిరోజు 40 పేపర్లు మూల్యాంకనం చేయనుండగా, వాటిని స్పెషల్ అసిస్టెంట్లు పరిశీలించిన అనంతరం వాటిలో 20 పేపర్లు చొప్పున చీఫ్ ఎగ్జామినర్లు పరిశీలిస్తారు. అలాగే డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు రోజుకు 45 చొప్పున, క్యాంప్ ఆఫీసర్ 20 చొప్పున మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను పునఃపరిశీలిస్తారు. కాగా, మూల్యాంకన కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని మూల్యాంకనం పూర్తయ్యే వరకు వైద్య సిబ్బందితో పాటు 108 అంబులెన్స్ కేంద్రం వద్ద ఉండేలా చర్యలు తీసుకున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 518.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.

అమ్మ.. బాబోయ్!

అమ్మతనం మాయం

- మారుతల్లి క్రూరత్వానికి బలైన కొండవీడుకు చెందిన బాలుడు
- చిలకలూరిపేటలో కన్నబిడ్డను చిత్రవధ చేసిన కన్నతల్లి
- రెండు రోజుల వ్యవధిలో రెండు అమానుష ఘటనలు
- రోజురోజుకు తగ్గిపోతున్న కుటుంబ విలువలు

తల్లిఒడిలో ప్రేమను ఆస్వాదించాల్సిన పసిబిడ్డలు, తండ్రుల ఆలనలో పెరగాల్సిన చిన్నారులు అమానుషత్వానికి బలవుతున్నారు. కొందరు చిన్నారులు తెలిసీ తెలియని వయసులో అమ్మల కర్కశత్వం చవిచూస్తున్నారు.. ఎవరికీ చెప్పుకోలేక.. ప్రతిరోజూ తల్లి లేదా పిన తల్లి పెట్టే వికృత చర్యలను తట్టుకోలేక.. ఆ చిన్నారులు పడిన వేదన అంతాఇంతా కాదు. ఏడ్చి, ఏడ్చి.. ఏడ్చే ఓపిక సైతం లేక, మూలుగుతూ కర్కశత్వం భరించారా చిన్నారులు. మరొక చిన్నారి తనువు చాలించాడు. వీపుపై దెబ్బల చారలు, తేలిన వాతలు, తమ కంటికింద ఏర్పడిన ఆరని కన్నీటి చారలు కసాయి అమ్మల కర్కశత్వానికి రుజువులుగా మారాయి. అమ్మతనానికి మచ్చ తెచ్చేలా చేసిన రెండు సంఘటనలు కేవలం రెండు రోజుల వ్యవధిలోనే వెలుగుచూడటం సభ్య సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది.



పినతల్లి దాడిలో మృతి చెందిన కార్తీక్



కవలలు కార్తీక్, ఆకాష్ (ఫైల్)


యడ్లపాడు: మానవత్వాన్ని కోల్పోయిన కొందరు తల్లులు స్వార్థం, సౌఖ్యం కోసం కుటుంబ సభ్యులు, వారి పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. చివరకు కటకటాలపాలై తమ జీవితాలను చేజేతులా చీకట్లోకి నెట్టేసుకుంటున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జన్మనిచ్చిన తల్లే కర్కశంగా మారి తన బిడ్డను చిత్రహింసలకు గురిచేస్తే, గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో తల్లిస్థానంలో ప్రేమను పంచాల్సిన పినతల్లి బాధ్యతను విస్మరించి అమానుషానికి పాల్పడడం రెండు జిల్లాల్లో కలకలం రేపింది.

కవలలపై పినతల్లి కిరాతకం

యడ్లపాడు మండలం కొండవీడు గ్రామానికి చెందిన రాడ్‌బెండింగ్ పనులు చేసే కంచర్ల సాగర్, కృష్ణాజిల్లా జనగాం ప్రాంతానికి చెందిన అనూష 8 ఏళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. తొలికాన్పులో కార్తీక్(6), ఆకాష్ అనే కవలలు జన్మించారు. రెండో కాన్పులో పాపకు జన్మనివ్వగానే తల్లి మృత్యువాత పడింది. పాపను యనమదల గ్రామస్తులకు దత్తత ఇచ్చారు. సాగర్ ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జి.లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. కొత్త జీవితంలో అడుగుపెట్టిన లక్ష్మి పాపకు జన్మనిచ్చింది. సాగర్ భార్యకు దాసోహం కావడంతో మొదటి భార్య పిల్లల్ని పినతల్లి లక్ష్మి వేధించడం ప్రారంభించింది. గతనెల 29వ తేదీన లక్ష్మి కార్తీక్, ఆకాశ్‌లను బెల్టు, కర్రతో విచక్షణ రహితంగా కొట్టింది. కార్తీక్‌కు తీవ్రంగా గాయమైంది. కసితీరక గొంతునులిమి చంపేసింది. ఇక చిన్నవాడైన ఆకాష్‌ను నిక్కర ఊడదీసి కాల్చిన పెనంపై కూర్చోబెట్టింది. తట్టుకోలేక, ఆ పసిహృదయం బాధతో చేసిన ఆర్తనాదాలు విన్న వీధిలోని వారందరూ పరుగున వచ్చారు. విషయం తెలిసిన సాగర్ చెల్లెలు విజయ ఫిరంగిపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని లక్ష్మి, ఆమె భర్త సాగర్‌ను అదుపులోకి తీసుకోగా, వీరికి కోర్టు రిమాండ్ విధించింది.

అమానుషంగా ప్రవర్తించిన అమ్మ

చిలకలూరిపేటకు చెందిన కొణతం మెతూషాల, గోరోజనపు దీప్తిలు ఏడేళ్ల కిందట ఒక్కటయ్యారు. కానీ వారి వివాహబంధం ఎంతో కాలం నిలవలేదు. ఏడాది కిందట విడాకులతో ముగిసింది. పిల్లలు తండ్రి వద్ద ఉంటూనే, అప్పుడప్పుడు తల్లి వద్దకు వెళ్లేవారు. భర్త నుంచి విడిపోయాక మరో వ్యక్తితో సహజీవనం సాగిస్తున్న దీప్తి, తన కన్నబిడ్డకు ప్రేమను పంచాల్సింది పోయి పాశవికంగా ప్రవర్తించింది. గతేడాది డిసెంబర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పాపను తీసుకెళ్లింది. కొన్నిరోజులుగా తల్లి వేధింపులు భరించలేక బాలిక గతనెల 31వ తేదీ ఇంటి నుంచి పారిపోయే క్రమంలో వీధి మలుపులో స్పృహతప్పి పడిపోయింది. ఇది గమనించిన బాలిక నాయనమ్మ ఏసమ్మ ఆసుపత్రికి తరలించి, అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో తల్లి దీప్తి, ఆమె సహజీవనం చేస్తున్న ప్రియుడు చిన్నారిని చిత్రహింసలకు గురిచేస్తున్నారని నిర్ధారణ అయ్యింది. వెంటనే పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసులే కాకుండా బాలల హక్కుల పరిరక్షణ అధికారులు సైతం స్పందించి చికిత్స నిమిత్తం బాలికను గుంటూరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ భవన్‌కు అప్పగించనున్నారు.



బాలిక వీపుపై తల్లిపెట్టిన వాతలు

12వ వేతన సంఘం ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఏపీ ఫ్యాప్టో నాయకుల డిమాండ్

నరసరావుపేట: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీ ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై నిరసన చేపట్టి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ ఎల్‌వీ రామిరెడ్డి, సెక్రటరీ జనరల్ బి.సంపత్ మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో కారుణ్యనియామకాలు వెంటనే చేపట్టాలని, కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. మూడు పెండింగ్ డీఏలను చెల్లించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ 57వ మెమో ద్వారా పాత పెన్షన్ విధానం అమలుచేయాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ, సరెండర్ లీవు బకాయిలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలుచేయాలని, 70ఏళ్ల దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75ఏళ్లు నిండిన వారికి 15శాతం అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ అమలుచేయాలని కోరారు. కమిటీ సభ్యులు ఎం.మోహనరావు, ఆర్.గోవిందరాజులు, వి.అశోక్‌కుమార్, మొహిద్దీన్ బేగ్, ఉస్మాన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కరెన్సీ ఎగ్జిబిషన్



కరెన్సీ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం కరెన్సీ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కో–ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డి ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, నాణేలను ప్రదర్శనలో ఉంచారు. రాజుల కాలం నుంచి బ్రిటిష్ వారి హయాం వరకు, ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి నేటివరకు వినియోగించిన కరెన్సీ, నాణేలను ప్రదర్శించారు. ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా ఖండాలకు చెందిన 78 దేశాల 489 నాణేలు, 76 దేశాలకు చెందిన 188 కరెన్సీ నోట్లు ఇక్కడ ఉంచారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కరెన్సీ, నాణేల వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. రిటైర్డ్ స్కూల్ టీచర్ కృష్ణయ్య, లింగాల తిరుపతయ్యలు నాణేలు, కరెన్సీ నోట్లను సేకరించి ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని ఇన్ని దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ నోట్లను సేకరించడం అభినందనీయమన్నారు. 30 సంవత్సరాలుగా కరెన్సీ సేకరణను కృష్ణయ్య హాబీగా చేసుకోవడం వలన ఇది సాధ్యమయిందని తెలిపారు. పాఠశాల స్కూల్ మాస్టర్ పమ్మి వెంకటరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 1,30,848 బస్తాలు మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,30,848 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,28,132 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,600 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 56,061 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

సజావుగా జేఈఈ మెయిన్స్

- గుంటూరు, పల్నాడులోని పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్
- పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు విస్తృత తనిఖీలు



పేరేచర్ల యూనివర్సల్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్ : జాతీయస్థాయి సాంకేతిక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశించేందుకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్–2025 రెండో సెషన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)లకు విద్యార్థులు హాజరయ్యారు. జేఈఈ మెయిన్స్ నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సీబీటీ విధానంలో ఆన్‌లైన్ పరీక్షల కోసం గుంటూరులో రెండు, పల్నాడు జిల్లాలో రెండు చొప్పున వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు అయాన్ డిజిటల్ జోన్‌లలో ఏర్పాటు చేసిన కేంద్రాల పరిధిలో విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు హడావుడి పడుతూ పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఈనెల 3, 4, 7, 8వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్ట్‌లలో పేపర్–1 (బీఈ, బీటెక్) ప్రవేశ పరీక్షలు జరగనుండగా, 9వ తేదీన పేపర్–2ఏ బీఆర్క్, పేపర్–2బీ బీ.ప్లానింగ్ పరీక్షలు జరగనున్నాయి.

తోడు దొంగలు చిక్కరు..దొరకరు

- గొలుసుల చోరీల్లో దిట్టలు
- మూడేళ్లలో 13కుపైగా దొంగతనాలు
- ఏ పీఎస్‌లోనూ కేసుల్లేవు
- ఎట్టకేలకు అరెస్టు చేసిన పోలీసులు
- రూ.32 లక్షల విలువ చేసే 390 గ్రాముల బంగారు సొత్తు స్వాధీనం



గొలుసులు పరిశీలిస్తున్న గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఇద్దరూ తోడు దొంగలు.. ఒంటరిగా వెళ్లే మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంచుకెళ్లడంలో నేర్పరులు. సీసీ కెమెరాలకు చిక్కరు.. దొరకరు.. మూడేళ్లలో 13కుపైగా దొంగతనాలు చేసినా ఏ పీఎస్ పరిధిలోనూ వీరిపై కేసుల్లేవు. ఎట్టకేలకు నల్లపాడు పోలీసులు వీరి ఆట కట్టించారు. ఇద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద రూ.32 లక్షల విలువ చేసే 390 గ్రాముల బంగారు సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాలను ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. గత నెలలో నల్లపాడు పీఎస్ పరిధిలోని లింగయ్యపాలెంలో, గుంటూరు క్లబ్ దగ్గర్లో ఒంటరిగా నడిచి వెళ్లే మహిళల మెడల్లో బంగారు గొలుసులను దుండగులు తెంచుకెళ్లారు. దీనిపై సీఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించారు. ఏటుకూరు రోడ్ డీఎస్ నగర్ తొమ్మిదో వీధిలో ఉంటున్న టైలర్ వల్లెపు శ్రీనును అనుమానితుడిగా అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అతనిచ్చిన సమాచారంతో వసంతరాయపురం నాలుగో వీధికి చెందిన అన్నపురెడ్డి శివ సుబ్రహ్మణ్యంను అరెస్టు చేశారు. వీరిద్దరూ కలిసి బంగారు గొలుసుల చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. వీరు గుంటూరు, బాపట్ల జిల్లాల్లో చోరీలు చేసినట్టు తేల్చారు. ఇప్పటివరకు 13కుపైగా చోరీలకు పాల్పడినా వీరిపై కేసులు లేవని గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.32 లక్షల ఖరీదు చేసే 390 గ్రాముల బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. కేసును దర్యాప్తు చేసిన సీఐ వంశీధర్, ఎస్ఐ జనార్దన్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్లు సాంబశివరావు, మస్తాన్‌వలి, బిక్షనాయక్, వెంకటేశ్వర్లును ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందించారు.

థియేటర్లో పరిచయంతో స్నేహితులుగా మారి..

శివసుబ్రహ్మణ్యం 2009లో చీరాల నుంచి గుంటూరు వచ్చి స్థిరపడ్డాడు. తొలినాళ్లలో ఆటోడ్రైవర్‌గా పనిచేసేవాడు. 2018లో ఓ సినిమా థియేటర్‌లో టైలర్ శ్రీను పరిచయమయ్యాడు. ఇద్దరికీ ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో 2022 నుంచి చోరీలకు శ్రీకారం చుట్టారు. ఒంటరిగా వెళ్లే మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంచుకెళ్లడం ప్రారంభించారు. స్కూటీపై వెళ్తూ గొలుసులు తెంచుకెళ్లేవారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా, ఆధారాల్లేకుండా జాగ్రత్తపడటంలో వీరు నేర్పరులు. ధనవంతులు ఉండే ప్రదేశాల్లో ఎక్కువగా చోరీలు చేశారు. దొంగలించిన సొత్తును తెలిసిన వారి ద్వారా బంగారు దుకాణాల్లో విక్రయించేవారు. ఆ సొమ్ముతో అప్పులు తీర్చుకుని జల్సాలు చేసేవారు. వీరు పట్టాభిపురం పీఎస్ పరిధిలో 2, నల్లపాడు పీఎస్ పరిధిలో 4, తెనాలి వన్‌టౌన్ పరిధిలో 2, అరండల్ పేట పీఎస్, తెనాలి త్రీటౌన్ పీఎస్, చీరాల టూ టౌన్, చీరాల త్రీ టౌన్ పీఎస్ పరిధిలో ఒక్కొక్క చోరీ చేసినట్టు విచారణలో పోలీసులు తేల్చారు.

క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

క్రోసూరు: ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహిసున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమాదేవీ బుధవారం తెలిపారు. పదవతరగతి పాసైన వారు, పదవతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఉచిత శిక్షణా తరగతులకు హాజరుకావచ్చునన్నారు. శిక్షణా తరగతులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందని, ఈనెల 4వ తేదీ నుంచి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు తరగతులుంటాయన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు హైకోర్టులో ఊరట

గురజాల: పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన 8 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై గతంలో జరగని గొడవను జరిగినట్లు సృష్టించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే చింతపల్లి పెద్ద సైదా, అల్లాభక్షులను అరెస్టు చేసి సబ్ జైల్‌లో రిమాండ్‌లో ఉంచారు. మిగిలిన ఆరుగురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చింతపల్లి చిన మస్తాన్, పెద జానీబాషా, దస్తగిరి, చిన సైదా, జానీబాషా, జాన్ వలీలు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో వీరి తరఫున న్యాయవాది సానేపల్లి రామలక్ష్మణ రెడ్డి వాదించారు. బుధవారం న్యాయమూర్తి ఈ ఆరుగురిపై ఎటువంటి చర్యలు చేపట్టరాదని, అరెస్టు చేయవద్దని వారిని ఇబ్బందులు గురిచేయవద్దని తీర్పునిచ్చినట్లు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి తెలిపారు.

గ్రానైట్ తరలింపు లారీ పట్టివేత



ముప్పాళ్ల: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా గ్రానైట్ తరలిస్తున్న లారీని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. నరసరావుపేట – సత్తెనపల్లి ప్రధాన రహదారిలోని ముప్పాళ్ల దర్గా సమీపంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.చంద్రశేఖర్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న లారీని గుర్తించారు. లోడ్‌కు సంబంధించి ఎటువంటి పత్రాలు లేవని గుర్తించి తదుపరి చర్యలు నిమిత్తం లారీని పోలీసులకు అప్పగించారు.

కోచ్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

జిల్లా స్పోర్ట్స్ అధికారి నరసింహారెడ్డి

నరసరావుపేట ఈస్ట్: క్రీడా శిక్షకుల ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పటియాల నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పి.ఎస్.గిరిషా, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మాస్ స్పోర్ట్స్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా మే 6వ తేదీ నుంచి జూలై 2 వరకు స్పోర్ట్స్ కోచింగ్ సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ ధ్రువ పత్రాలతో http://www.6wcc.nsnis.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మతాల మధ్య ఘర్షణలకే వక్ఫ్ సవరణ బిల్లు

బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



మార్కెట్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం, ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని ముస్లిం నాయకుడు షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం నరసరావుపేట మార్కెట్‌సెంటర్‌లో ముస్లిం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ఇతరులకు ముస్లింల వక్ఫ్ ఆస్తులను కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లౌకిక దేశంలో ఇలాంటి బిల్లు తీసుకొని వచ్చి మతాల మధ్య గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ బిల్లును ఆపేవరకు తమ పోరాటం సాగుతుందన్నారు. లౌకిక వాదులు, ప్రజా, కుల సంఘనాయకులను కలుపుకొని, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. మైనారిటీ నాయకుడు రఫీ మౌలానా, ఆదివాసీ నాయకుడు నాయక్, సీపీఐ నాయకుడు ఉప్పలపాటి రంగయ్య, పీడీఎం నాయకులు నలపాటి రామారావు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

బాకీ చెల్లించాలని ఇంటికి తాళాలు

బాధితురాలి ఫిర్యాదుతో వన్‌టౌన్ పీఎస్‌లో కేసు నమోదు

నరసరావుపేట టౌన్: భర్త చేసిన బాకీ తీర్చాలంటూ భార్యను బెదిరించి ఇంటికి తాళాలు వేసిన సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రకాష్‌నగర్ సిరి అపార్టుమెంట్‌లో అమర సుధారాణి నివసిస్తుంది. ఆమె భర్త వెంకటేశ్వరరావు ఆర్థిక ఇబ్బందులతో 2023లో ఆత్మహత్య చేసుకున్నాడు. అతను డబ్బులు బాకీ ఉన్నాడని కొంతమంది సుధారాణిని డబ్బుల కోసం గత కొన్ని నెలలుగా వేధిస్తున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం సుధారాణి బజార్‌కి వెళ్లిన సమయంలో అపార్టుమెంట్‌లోని ఆమె ప్లాటుకు తాళాలు వేసి తమ వద్ద నీ భర్త వెంకటేశ్వరరావు తీసుకున్న డబ్బులు ఇవ్వాలని ఆమెను నిలదీశారు. ఆమె నిరాకరించడంతో బెదిరించడంతోపాటు దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరి ప్రసాద్, కొత్తూరు సురేష్, పెనుగొండ ప్రభాకర్, పెనుగొండ ప్రతాప్, కండె హనుమంతరావు, కూరపాటి గుప్తా, నారాయణరావు, మల్లేశ్వరాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్ చరణ్ తెలిపారు.

కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



నకరికల్లు: ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి గల్లంతైన యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజుపాలెం మండలం పెదనెమలిపురి గ్రామానికి చెందిన దూదేకుల హర్షదుల్లా (21) మార్చి 31న తన మిత్రులతో కలసి మండలంలోని శ్రీరాంపురం సమీపంలోని బెల్లంకొండ బ్రాంచి కెనాల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లాడు. మిత్రులందరూ ఈత కొడుతుండగా హర్షదుల్లా కాలువ ఒడ్డున కూర్చొని నీళ్ల తాగుతుండగా ఒడ్డు విరిగి జారిపడి కాలువలో గల్లంతయ్యాడు. ఎంత వెదికినా ఫలితం లేకపోయింది. బుధవారం హర్షదుల్లా మృతదేహం నీటిపైకి తేలడంతో వెలికితీశారు. మృతుడు వెటర్నరీ డిప్లమో కోర్సు పూర్తి చేశాడు. తండ్రి హసన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు. చేతికొచ్చిన కొడుకు అకాలమృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఏఐ ద్వారా క్యాన్సర్ చికిత్సలు

నేడు గుంటూరు జీజీహెచ్‌లో లాంఛనంగా ప్రారంభం

గుంటూరు మెడికల్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా క్యాన్సర్ చికిత్సలు చేసేందుకు కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని డీఎంఈ ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు. తొలుత విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్, కాకినాడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, గుంటూరు జీజీహెచ్, కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లలో నవ్య కేర్ నెట్‌వర్క్ ప్రైవేటు లిమిటెడ్ నేషనల్ క్యాన్సర్ గ్రిడ్, ఆంధ్రప్రదేశ్ చాప్టర్‌తో ఏఐ ద్వారా చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టులుగా రంగం సిద్ధం చేసింది. ఈ సందర్భంగా బుధవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి, డాక్టర్ గిరిజవోలు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ టీఎంసీ, ఎన్‌సీజీ నవ్య పైలట్ ప్రాజెక్ట్‌లో పనిచేయడానికి తాము చాలా సంతోషిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎంఎల్ టెక్నాలజీతో క్యాన్సర్‌పై రోగులు, వారి బంధువుల్లో ఉండే ఆందోళనను తొలగించే అవకాశం ఉంటుందని, సెకండ్ ఒపీనియన్ తీసుకునేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మట్లాడుతూ రోగులు తమ సొంత జిల్లాల్లోనే సత్వర క్యాన్సర్ వైద్యం పొందేందుకు ప్రభుత్వం నూతనంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని పేర్కొన్నారు.

నదిలో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం



అమరావతి: నదిలో చేపలు పట్టడానికి వెళ్లి మంగళవారం గల్లంతైన యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. కృష్ణానదిలో అమరేశ్వర స్వామి గుడి సమీపంలో గల్లంతైన స్థానిక బీసీ కాలనీకి చెందిన నల్లకొట్ల రాజేష్(19) మృతదేహం బుధవారం మధ్యాహ్నం లభ్యమైంది. నదిలో గజ ఈతగాళ్లు బుధవారం ఉదయం నుంచి గాలిస్తుండగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో రాజేష్ మృతదేహాన్ని కనుగొని ఒడ్డుకు చేర్చారు. అమరావతి పోలీసులు రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. శవపంచనామా చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని రాజేష్ కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కిరణ్మయి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా చిలువూరి కిరణ్మయి బుధవారం విధుల్లో చేరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ప్రస్తుతం మంగళగిరి టీబీ శానిటోరియం హాస్పిటల్‌లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కిరణ్మయి విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతి పొంది గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. గుంటూరు జిల్లాకు చెందిన కిరణ్మయి సికింద్రాబాద్ గాంధీలో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) కోర్సు 2000లో పూర్తి చేశారు. మెదక్ జిల్లా సిద్దిపేట పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా 2001 జనవరిలో చేరి ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. హెడ్‌నర్సుగా 2007లో ఉద్యోగోన్నతి పొంది నిజామాబాద్ పీచ్‌పల్లికి బదిలీ అయ్యారు. అనంతరం తెలంగాణ నుంచి ఏపీకి ప్రత్యేక బదిలీ అయి 2008లో గోరంట్లలోని జ్వరాల ఆస్పత్రిలో చేరారు. 2018 వరకు అక్కడే పనిచేసి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం మంగళగిరి బదిలీ అయ్యారు. ఇప్పుడు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరిన కిరణ్మయికి పలువురు నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ యూనియన్ అధికారులు, వైద్య సిబ్బంది, వైద్యులు అభినందనలు తెలిపారు.

రేవుల హక్కులపై జెడ్పీలో బహిరంగ వేలం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా కృష్ణానదీ పరివాహక ప్రాంతంలోని 11 రేవుల్లో పడవలు, బల్లకట్లు నడుపుకునేందుకు బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలంలో ఏడు రేవులను పాటదారులు దక్కించుకోగా, నాలుగు రేవులకు పాటదారులు పాల్గొనకపోవడంతో వాయిదా వేశారు. అచ్చంపేట, మాచవరం, అమరావతి, కొల్లిపర మండలాల పరిధిలోని చామర్రు, గింజుపల్లి, తాడువాయి, మాదిపాడు, దిడుగు, ధరణికోట రేవుల్లో పడవ, పుట్లగూడెంలో బల్లకట్టును వచ్చే ఏడాది మార్చి 31 వరకు తిప్పుకునేందుకు నిర్వహించిన వేలంలో పాటదారుల నుంచి జెడ్పీకి మొత్తం రూ.1,46,07,526 ఆదాయం సమకూరింది.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ పరిచయం

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గ పరిచయ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. గెలుపొందిన అభ్యర్థులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు పలు జడ్జిలు అభినందనలు తెలిపారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారి కాసు వెంకటరెడ్డిని పలువురు న్యాయవాదులు, బార్ కౌన్సిల్ మెంబర్ వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి అభినందించారు. బార్ కొత్త అధ్యక్షుడు వెంగళ శెట్టి శివ సూర్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదుల ప్రయోజనాల కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ఆర్డీఓ రమణాకాంత రెడ్డి

88త్యాళ్లూరు(క్రోసూరు): ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని, తద్వారా భూముల సర్వే సక్రమంగా జరిగి వివాదాలకు తావులేకుండా కొలతలు వేసి పాస్‌పుస్తకాలు జారీ చేయబడతాయని సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని అందుకూరు గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించి, 88త్యాళ్లూరు గ్రామంలో రీసర్వే గ్రామ సభలో ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. 3099.70 ఎకరాల విస్తీర్ణం గల 88త్యాళ్లూరు రీసర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని మండల సర్వేయర్లు, అసిస్టెంట్ సర్వేయర్లను ఆదేశించారు. భూమి విస్తీర్ణం సర్వే చేయటంతో భూమి హద్దులు, ప్రభుత్వ భూమి, రైతుల భూములను గుర్తించటం, ఆర్ఓఆర్, అభ్యంతరాలపై నోటీసులు ఇవ్వటం, ఆన్‌లైన్ చేయడం, పాస్‌పుస్తకాలు జారీ చేయడం జరుగుతాయని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీవీ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, గ్రామ నాయకులు నలజాల సదాశివరావు, రైతులు పాల్గొన్నారు.

బ్లేడ్‌తో ఇరువురిపై దాడి



క్షతగాత్రుడు నవీన్

సత్తెనపల్లి: బ్లేడుతో ఇరువురిపై యువకుడు దాడి చేసిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన గింజుపల్లి అశోక్ కుమార్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం పూటుగా మద్యం సేవించాడు. ఇంటి సమీపంలోని ఎనిమిదో తరగతి చదువుతున్న మేడూరు చాణిక్యతో ఏంటి రా నా వైపు చూస్తున్నావ్ అంటూ దూషించి దాడి చేసి బెదిరించడంతో చాణిక్య వెంటనే తల్లి మేడూరు జ్యోతికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఎయిర్‌టెల్ కార్యాలయంలో పనిచేస్తున్న జ్యోతి తన బిడ్డ చాణిక్యపై దాడి చేస్తున్నారంట చూసి రమ్మని తన వద్ద పనిచేసే ఏల్చూరి నవీన్, తూమాటి శ్రీకాంత్‌లను పంపింది. వారు ఇరువురు ఘటన స్థలానికి చేరుకొని ఎందుకు దాడి చేసి, బెదిరిస్తున్నావు అంటూ ప్రశ్నించగా బ్లేడ్ తీసుకొని ఏల్చూరి నవీన్ మెడ, చెవి పైన, తూమాటి శ్రీకాంత్ చేతులపై అశోక్‌కుమార్ దాడి చేశాడు. ఎవరైనా దగ్గరకు వస్తే దాడి తప్పదు అంటూ బ్లేడు చూపిస్తూ హల్‌చల్ చేయగా స్థానికులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ ఏఎస్ఐ సుబ్బారావు పరారైన అశోక్ కుమార్‌ను క్రిస్టియన్ పేటలో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయాలపాలైన క్షతగాత్రుడు ఏల్చూరి నవీన్‌ను ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు 10 కుట్లు వేశారు. అలాగే తూమాటి శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఏల్చూరి నవీన్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సమృద్ధిగా సూక్ష్మపోషకాలు

అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్



నాగిరెడ్డిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, నాయకులు

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానాల్లో పంటలను సాగు చేయడం, అంతర పంటలను పండించడం ద్వారా అధిక దిగుబడి ఆదాయంతో పాటు భూమికి కావలసిన సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయని ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం, పాపాయపాలెం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ విధానంపై గ్రామ సభలు నిర్వహించారు. అడిషనల్ డీపీఎం మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025– 26 సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయం చేసే ప్రతి ఒక్క రైతు భూమి విస్తీర్ణం, పండించే పంటలు, పాడి పశువుల వివరాలను సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఏ సైదయ్య, పవన్ కుమార్, అనంతలక్ష్మి, మాధవి, మహాలక్ష్మి, వీఏఏలు అయ్యప్ప, వంశీ, నాయకులు వెన్న వెంకటరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, ఒర్సు ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్, ఏసీబీ ఫోర్స్ లీగల్ కమిటీ ఎంపిక



చల్లా వెంకటేశ్వరరావు



భవనం నర్సిరెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో అవినీతి నిరోధక మానవ హక్కుల పరిరక్షణ, హ్యూమన్ రైట్స్ ఫోర్స్ సంస్థకు మాచర్ల పట్టణానికి చెందిన ఇరువురు న్యాయవాదులను రాష్ట్ర, జిల్లా లీగల్ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ బుధవారం ఫౌండర్ దేవానంద్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది భవనం వెంకట నరసింహారెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్‌గా ఆర్‌జీఎస్, ఏసీబీ తరఫున ఎంపిక చేసి ఉత్తర్వులు అందించారు. మరో న్యాయవాది చల్లా వెంకటేశ్వరరావును పల్నాడు జిల్లా సంస్థ ఇన్‌ఛార్జిగా, జిల్లా లీగల్ అడ్వైజర్‌గా నియమించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మానవ హక్కుల పరిరక్షణకు సంస్థ తరఫున కృషి చేస్తామన్నారు. వీరిని పలువురు అభినందించారు.

ఆర్థిక స్వావలంబనతో మహిళల్లో ఆత్మవిశ్వాసం



బాపట్ల: ఆర్థిక స్వావలంబనతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి అన్నారు. ఐసీఏఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా వ్యవసాయ కళాశాల జీవ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఈపూరుపాలెంలో స్వయం ఉపాధి కల్పన నైపుణ్యాలపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసూనారాణి మాట్లాడుతూ మహిళలంతా చేతివృత్తుల్లో నైపుణ్యం పెంచుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు వ్యాపారవేత్తలుగా రాణించాలని తెలిపారు. ఈపూరుపాలేనికి చెందిన కార్యంపూడి సుబ్బారావు హ్యాండ్ పెయింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్‌పై అవగాహన కల్పించారు.

సహజీవనానికి అడ్డు వస్తుందని చిన్నారికి చిత్రహింసలు

మంగళగిరి: సహజీవనానికి అడ్డు వస్తుదన్న అక్కసుతో తల్లి, పెద్దనాన్న చిన్నారిని చిత్రహింసలు పెట్టి గాయపరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తాడేపల్లి మండలం గుండిమెడకు చెందిన మరియమ్మకు ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. చిన్నకుమార్తె ప్రీతి అక్క భర్త నాగేంద్రబాబుతో ప్రేమలో పడి సహజీనం చేస్తోంది. దీనిని గమనించిన ప్రీతి భర్త ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. ప్రీతికి మూడేళ్ల పాప ఉంది. దీంతో పాపతో సహా ప్రీతి, నాగేంద్రబాబు చినకాకానిలో అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకుని మూడునెలలుగా నివాసం ఉంటున్నారు. తమ బంధానికి అడ్డు వస్తుందన్న అక్కసుతో కొద్ది రోజులుగా నాగేంద్రబాబు పాపను కొట్టి చిత్రహింసలు పెడుతున్నాడు. పాపను అమ్మమ్మతో ఉండాలని ఒత్తిడి చేస్తున్నాడు. మంగళవారం రాత్రి నాగేంద్రబాబు ఇంటికి వచ్చేసరికి పాప ఏడుస్తుండడంతో కోపంతో ఊగిపోయాడు. దారుణంగా కొట్టాడు. ప్రీతి కూడా అడ్డు చెప్పలేదు. సమాచారం తెలుసుకున్న అమ్మమ్మ మరియమ్మ పాపను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించింది. బుధవారం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.